# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**NOVEMBER - 2016**

సంవత్సర చందా రూ. 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6.30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోనీ గూటం |

**Youtube లో satyavanichurchofchrist.com**

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి


**SATYA VANI**

P.O.BOX. 80, KAKINADA

PIN : 533004. Ph : 0884 - 2363722

98489 98547, www.satyavanicoc.com

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

సంపుటి - 37 నవంబర్- 2016 సంచిక -3

## యేసు రక్షకుడని అంగీకరించుట

### (Accepting Jesus as Saviour )

సత్యవాణి టి.వి. కార్యక్రమములను విని అనేక వేలకొలది ప్రజలు మాకు ఉత్తరములు వ్రాయుచున్నారు. అందుకై మేము దేవునికి మీకు కూడ కృతజ్ఞులమై యున్నాము. అనేకులు యేసు ప్రభువని, వారి ఆత్మ రక్షకుడని అంగీకరించినట్లు కూడా మాకు తరుచు వ్రాస్తూయుంటారు. యేసు ప్రభువు నీ ఆత్మ రక్షకుడని అంగీకరించుట అంటే యేమిటో, ఆ మాటలలో ఏమి ఇమిడి యున్నదో ఈ రోజు కొంత తెలిసికొందుము.

**దేవుని తెలిసికోవాలి:**

యేసు ప్రభువు నిన్ను, నీ ఆత్మను రక్షింపవలెనంటే నీవు దేవుని తెలిసికొనుట అత్యవసరము. "అద్వితీయ సత్యదేవుడైన నిన్నును, నీవు పంపిన యేసుక్రీస్తును ఎరుగుటయే నిత్యజీవము" అని యోహాను 17:3లో యేసు పలికెను. యేసే రక్షకుడని అంగీకరించుట యనగా ఆయనే ప్రభువని అంగీకరించుట అన్నమాట. ఆయనే ప్రభువని మనము అంగీకరించని యెడల, మన రక్షణార్థమై ఆయన వాక్యము ఏమి చెప్పుచున్నదో దానిని మనము అంగీకరించలేము. రక్షణను వెదకు పాపులు ఆయనే రక్షకుడని అంగీకరించవలెనని క్రొత్త నిబంధన బోధించుచున్నది. యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొనవలసి యున్నది (రోమా 9:9). నీవు ఆయన అనుచరుడవై ఆయన లోనికి నీటిలో

ముంచడము పొంది ఆయన అధికారమునకు లోబడవలసి యున్నది. అటుతరువాత క్రీస్తునందు నమ్మకమైన జీవితమును జీవించుట కవుసరమైన ఆయన ఆజ్ఞలన్నిటిని పాటించవలసి యున్నది (మత్తయి 28:19-20).

**ప్రభువును తెలిసికోవాలి :**

పెంతెకోస్తను పండుగ దినమున యేసుప్రభువని మొట్టమొదటిగా ప్రకటింపబడెను. దేవుని కుడి పార్శ్వమునకు హెచ్చింపబడిన క్రీస్తు, తన శత్రువులాయన పాదముల క్రింద పాదపీఠముగా ఉంచబడువరకు ఆయన ప్రభువై యుండునని ప్రకటింపబడెను. (అపొ.కా. 2:33-35). ఈ యేసునే దేవుడు ప్రభువుగాను, క్రీస్తుగాను నియమించెనని ఆదినమందు పేతురు నిరూపించెను. యేసును ప్రభువుగా అంగీకరించిన వారాదినమందే బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 2: 36-38,41). బాప్తిస్మము పొందుటలో వారాయన అధికారమునకు లోబడిరి.

యేసుప్రభువని అంగీకరించు వారు ఆయన మాటలను వినవలెను. ఆయన మాట విననివాడు ప్రజలలో ఉండకుండ సర్వనాశనమగును (అపొ.కా.3:22-23). ఆయన మాట విను ప్రతివానిని వాని దుష్టత్వము నుండి ఆయన మళ్ళించి ఆశీర్వదించును (3:26). యేసు నా ఆత్మరక్షకుడని అంగీకరించు ప్రతివాడును నోటితో కేవలము ఆమాటలు చెప్పుట కాదు గాని ఆయనకు విధేయత చూపించు క్రియల ద్వారా ఆయనే అతని జీవితములో ప్రభువని నిరూపించవలెను. క్రీస్తే సంఘమునకు శిరస్సు లేక ప్రభువై యున్నారు. ఆయనే దానికి రక్షకుడై యున్నారని ఎఫెసీ 5:23లో అందుకే అపొ.పౌలు వ్రాసెను.

**రక్షణ గూర్చి తెలిసికోవాలి :**

యేసే నా ఆత్మరక్షకుడని అంగీకరించుటలో క్రీస్తును గూర్చి, ఆయన యిచ్చు నిత్యరక్షణను గూర్చి అంతా నాకు తెలును అని అనుకొనుటకాదు. యేసు యొక్క అధికారమునకు లోబడగానే మనము క్రీస్తునందు క్రొత్తగా జన్మించిన శిశువుల మగుదుము. అందువలన మనము ఆత్మీయముగా దినదినము పెరుగుచు ఆయన వాక్యములోని లోతైన సత్యములను తెలిసికొనవలసియున్నది. వాటిని నేర్చుకొనుటయే గాక యితరులకు మనము బోధించవలసి యున్నది.

యేసు నా ప్రభువు, నా ఆత్మ రక్షకుడని చెప్పుచు ఆయన చెప్పు

మాటలకు లోబడని యెడల అది సవ్యము కాదు అని నీవు గ్రహించవలెను. అందుకే "నేను చెప్పుమాటల ప్రకారము మీరు చేయక- ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచుట ఎందుకు?". "ప్రభువా ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములోకి ప్రవేశింపడు గాని పరలోకమందున్న నా తండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును" అని యేసు బోధించెను (లూకా 6:46; మత్తయి 7:21). మన మాయన ఆజ్ఞలకు లోబడుట ద్వారా ఆయన మన ప్రభువని, రక్షకుడని నిరూపించగలము, గాని వేరే విధముగా కాదు. "ఆయనను ఎరిగి యున్నానని చెప్పుకొనుచు, ఆయన ఆజ్ఞలను గైకొనని వాడు అబద్ధికుడు; వానిలో సత్యము లేదు" అని భక్తుడైన యోహాను వ్రాసెను (1యోహాను 2:3-6).

నమ్మకముగా ఉండాలి :

యేసు నా ఆత్మ రక్షకుడని అంగీకరించి నంతలో మోక్షాన్ని సాధించేశావని నీవు అనుకొనవద్దు. మోక్షమార్గములో ప్రయాణించుచు ఎన్నడు పాపము చేయలేనని నీవనుకొనవద్దు. క్రైస్తవ జీవితములో నీవు అనేక శోధనలను, శ్రమలను ఎదుర్కొనవచ్చును. అంతము వరకు జయించిన నాడే నీవు రక్షింప బడుదువు. మధ్యలో ప్రభువైన క్రీస్తును విడనాడి తిరిగి లోకముతో కలసిపోయిన యెడల నీ ఆత్మను నీవు కోల్పోగలవని గ్రహించుము. "ఏలయనగా సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమై మనము భక్తి హీనతను ఇహలోక సంబంధమైన దురాశలను విసర్జించి, శుభప్రదమైన నిరీక్షణ నిమిత్తము, అనగా మహాదేవుడును మన రక్షకుడైన యేసుక్రీస్తు మహిమ యొక్క ప్రత్యక్షత కొరకు ఎదురుచూచుచు ఈ లోకములో స్వస్థ బుద్ధితోను, నీతితోను, భక్తితోను బ్రతుకుచుండ వలెనని మనకు బోధించు చున్నది" (తీతు 2:11-13).

నీవు క్రీస్తే నీ ఆత్మరక్షకుడని అంగీకరించి, బాప్తిస్మము పొంది క్రైస్తవుడవయినను కూడ, ఆయన ప్రభుత్వమును నీవు ఎదురాడే ప్రమాదమున్నదని గ్రహించవలెను. అపో.కా. 5వ అధ్యాయములో అననీయ సప్పీరాలను దంపతులనుగూర్చి దేవుని గ్రంథ మందు వ్రాయబడియున్నది. వారు యేసుక్రీస్తును నమ్మి, ఆయన ఆజ్ఞలకు లోబడిరి. అయితే దేవుని యెదుట వారు అబద్ధమాడి, పరిశుద్ధాత్మను మోసగించుటకు ప్రయత్నము చేసిరి. క్రీస్తుయొక్క సర్వాధికారమునకు వారు తిరుగుబాటు చేసిరి. తత్ఫలితముగా వారిద్దరు అక్కడే నాశనమైరి. (అపో.కా. 5:3:14).

యేసే నా ఆత్మ రక్షకుడని నీవంగీకరించునప్పుడు ఆయన మాటలకు నీవు లోబడవలసియున్నది. దేవుని వాక్యమును ఉన్నది ఉన్నట్టుగానే నీవు బోధించవలసియున్నది. దేవుని వాక్యమునకు మనము కొంత కలుపుట గాని, తీసివేయుటగాని లేదా మార్చి వేయుట గాని చేయలేము. అట్లు చేయువారు నిజానికి యేసుయొక్క అధికారమునకు లోబడనివారు. యేసే ప్రభువని, నా ఆత్మరక్షకుడని నీవంగీ కరించిన నాడు నీవు డినామినేషన్ సంఘము నుండి వేరు కావలసియున్నది. క్రీస్తు అధికారములో ఒకే ఒక్క సంఘమునకు ప్రభువు, రక్షకుడు, శిరస్సై యున్నారు. నీవాయన అధికారమునకు లోబడినవాడవైతే ఆయన నామమును ధరించిన సంఘములో యుండవలెను. డినామినేషన్ సంఘములు క్రీస్తు యొక్క అధికారము చొప్పున స్థాపించబడలేదు. అవి ఒకానొకప్పుడు పెల్లగింపబడునని మత్తయి 15:13లో యేసు బోధించెను.

నీవు క్రీస్తును నీ ఆత్మరక్షకునిగా అంగీకరించితినని అనుకొనుచున్న యెడల నీవు నీటి మూలముగాను, ఆత్మమూలము గాను జన్మించిప వాడవని యర్థము. అంటే యేసు యొక్క మాటలను విని, విశ్వసించి నీటిలో ముంచడము బొందితివని దాని యర్థము. నీవు ఈ ప్రక్రియను జరిగించితివా? లేని యెడల క్రీస్తు నా ఆత్మ రక్షకుడని నీవు చెప్పుకొను సంగతులు వ్యర్థము. కేవలము మాటలు చెప్పుచు క్రియలు లేకుండా ఎవడు మోక్షము చేరలేడు. ఆ అంతిమదినమందు అనేకులు యేసును చూచి ప్రభువా, ప్రభువా, మేము నీ నామమున ప్రవచింపలేదా? నీ నామమున, దయ్యములను వెళ్ళగొట్టి లేదా? నీ నామమున అనేకవైన అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు గాని ప్రభువు వారిని చూచి, అక్రమము చేయువారలారా, నాయొద్ద నుండి పొండని వారికి చెప్పును (మత్తయి 7:22). వారు యేసే ప్రభువని కేవలము మాటలు పలికినవారే గాని ఆయనకు ఎన్నడు విధేయత చూపనివారు, నరకమే వారి గతి.

అయితే నీ సంగతియేమి? యేసే క్రీస్తని నమ్ముము. ఆయనే నిన్ను రక్షించ గలవాడని గ్రహించి నీ పాపములను పరిత్యజించి బాప్తిస్మము పొందుము. అప్పుడే ఆయన నీ రక్షకుడగును గాని అంతకు ముందు కాదుసుమా!!



# యేసుక్రీస్తు యొక్క దైవత్వము -2
## (The Deity of Jesus Christ - 2 )

గత సంచికలో యేసుక్రీస్తు ఆది నుండియు దేవుడై యుండెననియు, ఆయన వాక్యమైన దేవుడనియు, ఈ లోకానికి శరీరమును ధరించి వచ్చిన దేవుడనియు గమనించితిమి. అంతే గాకుండ ఆయన శరీరధారియై యున్నపుడు దేవుని యొక్క సర్వపరిపూర్ణత ఆయనలో యుండెననియు, అదృశ్య దేవుని యొక్క స్వరూపియై యుండెననియు గమనించితిమి. ఈ రోజు కూడ యేసు యొక్క దైవత్వాన్ని మరికొంత తెలిసికొందము.

### దేవుని కుమారుడు

యోహాను 10:35లో దేవుని కుమారుడు అనుపదము ఆయనకు వర్తించుచున్నట్లు యేసు చెప్పెను. “నేను దేవుని కుమారుడను అని చెప్పినందుకు, తండ్రి ప్రతిష్టచేసి యీ లోకములోనికి పంపినవానితో, నీవు దేవదూషణ చేయుచున్నావని చెప్పుదురా?” అని ఆయన పలికెను. యేసుక్రీస్తు దేవుని కుమారుడని యితరులు ఆయనను గూర్చి ఒప్పుకొనిరి లేదా సాక్ష్యమిచ్చిరి. అది యధార్ధమేనని ఆయన అంగీకరించెను. సరిగదా ఆయన దేవుని కుమారుడనని తననుగూర్చి తాను ఆరోపించుకొనెను.

‘దేవుని కుమారుడు’ అను పదము వివిధ సందర్భములలోను, వివిధ భావములతోను మనకు బైబిలు నందు కనబడును గాని కొన్ని ప్రత్యేక వచనములలో క్రీస్తుయొక్క కుమారత్వము దైవత్వాన్ని తప్పక సూచించుచున్నది. ఆయన దేవుని అద్వితీయ కుమారుడనుటలో ఈ భావము ఇమిడియున్నది (యోహాను 3:16,18). దేవుని కుమారుడుగా ఆయన తీర్పు తీర్చునని చెప్పబడి యున్నది. “తండ్రిని ఘనపరచునట్టుగా అందరును కుమారుని ఘనపరచవలె నని తీర్పు తీర్చుటకు సర్వాధికారము కుమారునికి అప్పగించియున్నాడు” అని యోహాను 5:22లో యేసు పలికెను. తండ్రివలెనే ఆయన జీవము గలవాడు. తన కిష్టము వచ్చినవారిని బ్రతికించగలడు అని 21వ వచనము చెప్పుచున్నది. అంతేకాదు, ఆయన నిత్యజీవము నిచ్చునని కూడా యోహాను 10:10 బోధించు చున్నది. అందరు తండ్రివలెనే కుమారుని ఘన పరచవలెనని తండ్రి కోరుచున్నారు.

## యేసు నిత్యుడు

క్రీస్తు నిత్యము నుండి యున్నారు. నిత్యము ఉండువారు. ఆయన ఆదాము అబ్రహాముల కంటె ముందు నుండియే గాక, ఈలోకము సృష్టింపబడక ముందు నుండి, నిజానికి నిత్యము నుండి యున్నవాడు. ఆయన నిత్యుడు. ఈ సంగతులను బైబిలు నుండి కనుగొందము. యేసుక్రీస్తు యోహాను కంటె ముందున్న వాడని బాప్తిస్మమిచ్చు యోహానే సాక్ష్యమిచ్చెను. "నా వెనుక వచ్చువాడు నాకంటె ప్రముఖుడు గనుక ఆయన నాకంటె ముందటివాడని" అతడు పలికెను (యోహాను 1:15). యోహాను 8:58లో "యేసు-అబ్రాహాము పుట్టక మునుపే నేను ఉన్నానని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను". జగత్పునాది వేయబడక ముందే క్రీస్తు ఉండెనని యోహాను 17:5, 24 వచనములు తెలియజేయు చున్నవి. ఆయన పురాతనకాలము నుండి శాశ్వత కాలము వరకు యుండువాడని మీకా 5:2లో వ్రాయబడి యున్నది. ఆయన నిత్యము ఉండువాడు గనుక ఆయన ఉండుననువాడు. భావిలో ఆయన యెల్లప్పుడు ఉండువాడు. "ప్రభువా, నీవు ఆదియందు భూమికి పునాది వేసితివి. ఆకాశములు కూడ నీచేతి పనులే. అవి నశించునుగాని నీవు నిలిచి యుందువు" అని హెబ్రీ 1:11లో వ్రాయబడియున్నది. "ఏలయనగా మనకు శిశువుపుట్టెను, మనకు కుమారుడు అనుగ్రహింపబడెను. ఆయన భుజము మీద రాజ్యభార ముండును. ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త, నిత్యుడగు తండ్రి సమాధానకర్తయగు అధిపతి యని అతనికి పేరు పెట్టబడును" అని క్రీస్తును గూర్చి ప్రవక్తయైన యెషయా ప్రవచించెను (యెషయా 9:6).

## సర్వాంతర్యామి, సర్వజ్ఞుడు :

యేసుక్రీస్తు సర్వాంతర్యామి, సర్వజ్ఞానియై యున్నారు. ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదాకాలము మీతోకూడ ఉన్నానని ఆయన తన శిష్యులకు హామీ ఇచ్చెను (మత్తయి 28:20). అంతేకాదు, ఇద్దరు ముగ్గురు ఆయన నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ వారి మధ్యన ఉందునని ఆయన వాగ్దానము చేసెను (మత్తయి 18:20). యేసుక్రీస్తు సర్వజ్ఞాని, ఆయన అన్నింటిని యెరిగినవాడు. సమస్తమును ఆయన ఎరిగినవాడనియు, ఎవడును ఆయనను ప్రశ్నవేయ అగత్యము లేదనియు, అందువలన ఆయన దేవుని నుండి బయలుదేరి వచ్చిన వాడని వారు

నమ్ముచున్నారనియు ఆయన శిష్యులు ఆయనను గూర్చి సాక్ష్యము పలికిరి (యోహాను 16:30). ప్రభువా, నీవు సమస్తమును ఎరిగినవాడవు, నిన్ను ప్రేమించు చున్నానని నీవే యెరుగుదువు అని పేతురు ఆయన యెదుట ఒప్పు కొనెను (యోహాను 21:17). యేసుక్రీస్తు అందరిని యెరిగినవాడు. ఆయన మనుష్యుని ఆంతర్యము నెరిగినవాడు గనుక యెవడును మనుష్యుని గూర్చి ఆయనకు సాక్ష్యమియ్యనక్కర లేదు (యోహాను 2:24,25). నతనయేలు అంజూరపు చెట్టుక్రింద ఉన్నపుడే అతని గూర్చి ఆయన యెరుగును (యోహాను 1:48). సమరయ స్త్రీ యొక్క చరిత్ర నంతటిని ఆయన యెరిగియుండెను. మనుష్యుల హృదయాలోచనలు ఆయన యెరిగి యుండెను. ఆయనను అప్పగించు వానిని గూర్చి ఆయన యెరిగి యుండెను. "సమస్త బుద్ధిజ్ఞానములు సర్వసంపదలు ఆయనేయందే గుప్తములై యున్నవి" (కొలస్స 2:3).

ఆయన ఈలోకమందుండగా తన శక్తిని తనకుగా తాను పరిమితి చేసికొనెను. ఉదాహరణకు : ఆయన రెండవ రాకడ సమయమును గూర్చి ఆయన తన శక్తిని యిష్టపూర్వకముగా పరిమితి చేసికొనెను. "ఆదినమును గూర్చియు ఆగడియను గూర్చియు తండ్రి తప్ప ఏమనుష్యుడైనను, పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు" అని ఆయన మార్కు 13:32లో పలికెను. అయితే ఆయన ఇప్పుడు పరలోకమందున్న తన తండ్రి యొద్దకు ఎత్తబడెను. తండ్రి కుడి పార్శ్వమున ఆయన ఆసీనుడై యున్నాడు. గనుక ఆయన తెలిసికొనవలసిన ప్రతి సంగతిని తెలిసికొనును. ఆయన సర్వజ్ఞాని.

యేసుక్రీస్తు సర్వశక్తిమంతుడు. సమస్తమును ఆయన తన వాక్‌శక్తి వలన చలింపజేయుచున్నాడు. సమస్తమును ఆయనే చేసెను. సమస్తమును ఆయన వాక్‌శక్తి వలన చేయబడెను. అందువలన "ప్రపంచములు దేవుని వాక్యము వలన నిర్మాణమైన వనియు, అందునుబట్టి దృశ్యమైనది కనబడెడు పదార్థములచే నిర్మింపబడ లేదనియు విశ్వాసముచేత గ్రహించుకొను చున్నాము" (హెబ్రీ 11:3). యేసుక్రీస్తు "దేవుని మహిమ యొక్క తేజస్సును ఆయన తత్వము యొక్క మూర్తిమంతమునై యుండి తన మహత్తుగల మాటచేత సమస్తమును నిర్వహించుచు ఉన్నత లోకమందు మహామహుడగు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండెను" అని హెబ్రీ 1:3,4లో

వ్రాయబడియున్నది. యేసుక్రీస్తు సర్వశక్తిమంతుడు. అందువలన ఇహమందును పరమందును నాకు సర్వాధికారమీయబడి యున్నదని ఆయన ప్రకటించెను (మత్తయి 28:18). ఆయన సమస్తమును సృజించిన సృష్టికర్త. సమస్తమును ఆయన మూలముగా కలిగెను. కలిగియున్నదేదియు ఆయన లేకుండ కలుగలేదు (యోహాను 1:3).

**మార్పులేని దేవుడు**

యేసుక్రీస్తు మార్పులేనివాడు. ఆయన యుగ యుగములు ఒకేరీతిగ యుండును. "యేసుక్రీస్తు నిన్న నేడు ఒక్కటే రీతిగా ఉన్నాడు; అవును యుగ యుగములకును ఒక్కటే రీతిగా ఉండును" (హెబ్రీ 13:8). పాత నిబంధనలో ఆయన యెహోవా దేవుడుగా బయలుపరచు కొనెను. క్రొత్త నిబంధనలో ఆయన యేసుక్రీస్తాయెను. అవును, యేసుక్రీస్తులో మార్పులేదు, మార్పురాదు.

దేవుడే ఈ లోకమునకు వచ్చి పాపులైన మనుష్యులను రక్షింపవెదకెను. నీవు, నేను కూడ పాపములో పడి నశించుచుండగా యేసుక్రీస్తు మనలను వెదకుచు వచ్చెను. ఆయన మన పాపముల నిమిత్తము సిలువపై బలి ఆయెను. ఆయన చిందించిన రక్తము ద్వారా మనకు విమోచనము లభించు చున్నది. దేవుడైన యేసుక్రీస్తు యిచ్చు రక్షణను మనము పొందవలెనంటే ఆయన ఆజ్ఞలకు మనము లోబడవలసియున్నది. ఆయన ఆజ్ఞలు భారమైనవికావు. యేసు ఇట్లనుచున్నారు : "నేను ఆయనననని (అనగా దేవుడనని లేక దేవుని కుమారుడనని) మీరు నమ్మని యెడల మీరు మీ పాపములోనే మరణింతురు" (యోహాను 8:24). మరల మీరు మారుమనస్సు పొందని యెడల మీ పాపములోనే మరణింతురని ఆయన చెప్పెను (లూకా 10:32), మన పాపక్షమాపణ నిమిత్తము నీటిలో ముంచడము బొందవలెనని ఆయన కోరుచున్నారు (అపొ.కా. 2:38).

నీవు యేసుప్రభువు నందు విశ్వసించు చున్నావా? అయితే తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగి వేసుకో (అపొ.కా. 22:16). పరిశుద్ధ జీవితమును జీవించుటకు దేవుడు నీకు సహాయము చేయునుగాక!!

- జాషువా గూటం

# మన మాదిరియైన యేసుక్రీస్తు

## (Jesus Christ, Our Example)

పరిచయము :

1. ఒకని మాటల కంటె అతని మాదిరి శక్తివంతమైనది.

ఎ) "నేను చేసినట్లుగాక, చెప్పినట్లు చెయ్యి" అతని తల్లిదండ్రులు పిల్లలకు హెచ్చరిక చేస్తే అది తప్పు.

బి) పరిసయ్యులకంటె యేసుక్రీస్తు ఎంతో గొప్పబోధకుడు. ఆయన చెప్పింది చేసారు. పరిసయ్యులు చెప్పుదురే గాని చేసేవారు కారు (మత్తయి 23:3-5)

సి) అపొ. పౌలు కూడ క్రీస్తును అనుకరించాడు. అందువలననే క్రైస్తవులు అతనిని అనుకరించుమని చెప్పాడు (1 కొరింధీ 11:1; 4:16).

2. క్రైస్తవులమని చెప్పుకొను వారి జీవితాలను లోకము నిశితముగా పరీక్షించు చున్నది గనుక క్రైస్తవులు తమ జీవితములో యేసుక్రీస్తును మాదిరిగా ఉంచుకోవాలి.

ఎ) అందువలన క్రైస్తవులే పత్రికలవలె లోకము వారిని స్టడీచేయుచున్నది (2 కొరింధీ 3:1-13).

బి) క్రైస్తవులు ఈ లోకమర్యాద చొప్పున నడువరాదని హెచ్చరింపబడుదురు (రోమా 12:1-2). వారు ఈ లోకముతో స్నేహము చేయకూడదు (యోహాను 17:16; యాకోబు 4:4).

సి) తల్లిదండ్రులు, సంఘపెద్దలు, బోధకులు మాదిరిగా కనబడుదురు. గాని ప్రతి క్రైస్తవుడు మాదిరియై యుండాలి.

I. శోధనల నెదుర్కొనునప్పుడు యేసు క్రీస్తు మన మాదిరియై యున్నారు.

ఎ. యేసుక్రీస్తు అనేక శోధనలు జయించారు (మత్తయి 4:1-11; హెబ్రీ 2:18).

బి. శోధనలో పడకుండు నిమిత్తము ప్రార్ధించవలెనని ప్రభువు తన శిష్యులకు బోధించారు (మత్తయి 6:9-13).

సి. క్రైస్తవులు శోధనను జయించగలరని లేఖనములు బోధించుచున్నవి (1కొరింధీ 10:13; 2పేతురు 2:9)

డి. క్రీస్తువలె ప్రతి క్రైస్తవుడు ప్రతి శోధనను ఎదుర్కొనాలి, జయించాలి (హెబ్రీ 4:15; 8:1).

II. ప్రార్ధనలో యేసు మన మాదిరియై యున్నారు :

ఎ. క్రీస్తు జీవితము ప్రార్ధన జీవితము

1. మాదిరి ప్రార్ధన (మత్తయి 6:9-15).
2. రహస్యమైన వాటిని గూర్చి, బయలు పరచబడిన వాటిని గూర్చి ప్రార్ధించుట (మత్తయి 11:25-26).
3. లాజరు సమాధి దగ్గర ప్రార్ధన

(యోహాను 11:41-42).

4. పేతురు విశ్వాసము సడలకుండునట్లు ప్రార్థన (లూకా 22:31-32).

5. ప్రభురాత్రి భోజనము స్థాపించునప్పుడు ప్రార్థన (మత్తయి 26:26-27).

6. గెత్సెమనేకు ముందు మానవులందరి కొరకు ప్రార్థన (యోహాను 17).

7. గెత్సెమనేలో ప్రార్థన (లూకా22:41-44)

8. ఆయనను హత్యచేయుచున్న వారి కొరకు ప్రార్థన (లూకా 23:24).

బి. ఆదిమ శిష్యులు ప్రార్థించినట్లు లేఖనములు చెబుతాయి (అపొ.కా. 2:42; 6:4; 7:59-60; 12:5).

సి. క్రైస్తవులందరు ప్రార్థించాలని హెచ్చరింపబడియున్నారు (1థెస్స 5:17; ఎఫెసీ 6:18; కొలస్స 4:2).

III. **క్షమించుటలో యేసుక్రీస్తు మన మాదిరియై యున్నారు.**

ఎ. ప్రార్థనలో క్షమించమని యేసు నేర్పించారు (మత్తయి 6:9-15).

బి. ప్రభువు యొక్క శత్రువు ఆయనను సిలువ వేసి చంపుచున్నను ఆయన వారిని క్షమించారు (లూకా 23:34).

సి. మనుష్యులు మారుమనస్సుపొందితే అందరినీ ఆయన క్షమించుటకు సిద్ధముగా యున్నారు (హెబ్రీ 10 :15-17; 2 పేతురు 3 : 9; 1 యోహాను 1:9).

డి. క్రైస్తవులు ఇతరులను క్షమించాలని చెప్పబడియున్నారు (లూకా 17:3-4; ఎఫెసీ 4:32).

IV. **దేవుని వాక్యము బోధించుటలోను అసత్యాన్ని ఖండించుటలోను యేసు క్రీస్తు మన మాదిరియై యున్నారు :**

ఎ. యేసుక్రీస్తు దేవుని నుండి వ్యక్తిగతముగా సువార్తను తీసికొని వచ్చారు మరియు భూమి మీద ఉన్నప్పుడు ఆయన దేవుని వాక్యమునే పలికారు (యోహాను 1:17; 3:34).

బి. మతసంబంధమైన పొరబాట్లను ఆయన ఖండించారు (మత్తయి 15:9; మత్తయి 23).

సి. క్రైస్తవులు దేవుని వాక్యాన్నే బోధించాలని, అసత్యాన్ని ఖండించాలని బోధింపబడ్డారు (ఎఫెసీ 5:11; 1పేతురు 4:11; రోమా 6:17-18).

V. **ఆయన తన బంధువులను ఆయన పనికి అడ్డు రానీయలేదు.**

ఎ. ఒకసారి యేసు తల్లియు, సహోదరులును ఆయన బోధించు చుండగా మధ్యలో ఏదోచెప్పబోయారు, అయితే వారి వలన ఆయన ఆటంకపరచబడనీయ లేదు (మత్తయి 12:46-50)

బి. మరొక సందర్భములో ఆయన సోదరులు ఆయన పనిలో అడ్డురాగా యేసువారిని అట్లు చేయనీయలేదు (యోహాను 7:2-9).

సి. తన శిష్యులు దేవుని, దేవుని వాక్యాన్ని తమ కుటుంబసభ్యులు కంటే ఎక్కువగా ప్రేమించాలని యేసు చెప్పారు (మత్తయి 10:35-38)

**VI. ఆయన హేళన చేయబడినను, ద్వేషింపబడినను యేసు ఎన్నడు తన పని నుండి విరమించలేదు.**

ఎ. హేళన చేయబడి, ద్వేషింపబడితే పని నుండి తప్పుకొనవలసివస్తే యేసుకు అట్టి అవకాశములు మెండు (హెబ్రీ 12:1-3; 1పేతురు 2:21-25).

బి. క్రైస్తవులు కూడ నిరుత్సాహము నెదుర్కొంటారు గాని వారు ఎన్నడు విరమించుకో కూడదు (గలతీ 6:9; 1కొరింథీ 15:58).

**ముగింపు :**

1. యేసుక్రీస్తు మన పరిపూర్ణ మాదిరియై యున్నారు. (1 పేతురు 2:21-23; యోహాను 13:1-15).
2. మన పొరుగింట్లోనే యేసుక్రీస్తు వుంటే మనం ఎట్లు జీవిస్తాము ?
3. అంతకంటే దగ్గరగా యేసు మన కున్నారు. ఆయన మన హృదయాల్లో వున్నారు (2 కొరింథీ 13:5; ఎఫెసీ 5:17).

- లూయిస్ రష్మోర్

## క్రైస్తవునిగా మాత్రమే

## ( A Christian Only )

అవును, మిత్రుడా నీవు కేవలము క్రైస్తవునిగా మాత్రమే యుండగలవు. అది అతిశయోక్తి కాదు. నీ చుట్టూయున్న వారు ఏదోఒక డినామినేషన్‌కు చెందిన వారు గనుక దీనిని నమ్మట నీకు కొంచెము కష్టముగా యుండును. నీవు కూడా ఏదో ఒక మావన కల్పిత సంస్థలో ఉండియుండవచ్చును. ఏది ఎట్లయినను నీవు క్రైస్తవునిగా మాత్రమే ఉండగలవు.

నేను క్రైస్తవునిగా మాత్రమే ఎట్లుండగలను? అని నీవు తలంచు చుండవచ్చును. దానికి జవాబిచ్చుట తేలికయే, నీవు యేసుక్రీస్తు సువార్తకు లోబడుట ద్వారా సింపుల్‌గా క్రైస్తవుడవు కాగలవు. ఒకడు సత్యమునకు, దేవుని చిత్తమునకు లోబడినప్పుడు క్రైస్తవుడుగా మాత్రమే యుండగలడు. "నేను సత్యమునకు విధేయుడనయ్యాను" అని నీవనుకొనుచుండవచ్చును. నిజంగానా ? దేవునికిని నీకును యదార్థముగా యుండుము. ఎంత యదార్థముగా యున్నను కొన్నిసార్లు పొరబడతారు.

క్రొత్త నిబంధనకాలములో సత్యము క్రైస్తవులనుగా మాత్రమే చేసెను. సత్యము వలన ఒకడు ఒక రకమైన క్రైస్తవునిగాను, ఇంకొకడు ఇంకొక రకమైన క్రైస్తవునిగాను కాలేడు. యిది యదార్థమని నీవంగీకరించక తప్పదు.

లేఖనములలో క్రైస్తవుడను పేరు మూడుసార్లు కనబడును. ప్రతిసారి అది ప్రత్యేకముగా క్రైస్తవులను గూర్చి మాత్రమే చెప్పెను. సరిగదా దానికి ముందు గాని వెనుక గాని ఏవిధమైన బిరుదు కల్పించబడలేదు. ఆ మూడు లేఖనములను ఇప్పుడు గమనించుదము. "మొట్టమొదట అంతియొకయలో శిష్యులు క్రైస్తవులనబడిరి" యని లూకా తెలియజేసాడు (అపొ.కా. 11:26). క్రీస్తు శిష్యులు మొట్టమొదట అంతియొకయలో అట్లు పిలువబడిరి. నాటి నుండి నేటి వరకు వారు అదే రీతిగా పిలుబడుచున్నారు. రెండవదిగా పౌలు అగ్రిప్పరాజు కూడ క్రైస్తవుడయితే మంచిదని అతనికి తెలియజేయగా అగ్రిప్ప "ఇంత సులభముగా నన్ను క్రైస్తవుని చేయచూచుచున్నావే" యని అతనికి జవాబిచ్చెను (అపొ.కా. 26:28). అప్పటికి వున్నవారు క్రైస్తవులే గనుక అగ్రిప్ప అట్లు జవాబిచ్చెను.

నీవు ఫలానా క్రైస్తవుడవు కాగలవని పౌలు ఎందుకు బోధించలేదు? అప్పటికి వున్నావారు క్రైస్తవులు మాత్రవే. డినామినేషనల్ క్రైస్తవులంటూ ఎవరు లేరు. ఒకడు సత్యవాక్యము బోధించినప్పుడు వినిన వాడు విశ్వసించి బాప్తిస్మము పొందితే కేవలము క్రైస్తవుడుగా మాత్రమే కాగలడు, క్రీస్తుసంఘముతో మాత్రమే అట్టివాడు చేర్చబడును. అగ్రిప్ప రాజు దీనిని గ్రహించుకొన్నాడు.

మూడవదిగా అపొ. పేతురు ఇట్లు చెప్పుచున్నాడు. "ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధననుభవించిన యెడల అతడు సిగ్గుపడక ఆపేరును బట్టియే దేవుని మహిమపరచవలెను" (1పేతురు 4:16). గనుక ఎవడైనను క్రైస్తవుడైనందుకు లేదా ఆపేరును ధరించుకొనినందుకు దానిని గూర్చి అతడు సిగ్గుపడనవసరం లేదు. సరిగదా క్రీస్తును బట్టి శ్రమలననుభవించుటకు అతనికి దొరికిన తరుణమును బట్టి దేవుని స్తుతించవలెను. క్రీస్తునామము కొరకు శ్రమననుభవించుటకు తగినవాడుగా ఎంచబడినందున అతడు దేవుని మహిమపరచవలెను. తద్వారా దేవుడు కూడా మహిమపరచబడును, దీనిని గమనించుము.

లేఖకుడు కేవలము క్రైస్తవుని గూర్చి మాత్రమే అక్కడ చెప్పియున్నాడు. మానవ కల్పితనామమును అతడు దానికి చేర్చలేదు.

ఇప్పుడు దయచేసి దిగువనున్న సింపుల్ వాస్తవములను గమనించుము : క్రైస్తవుడు కావాలంటే ఒకడు సత్యమును అంగీకరించాలి, దానికి కలుపకూడదు, దాని నుండి తీసివేయకూడదు (ప్రకటన 22:18-19). క్రైస్తవుడు కావాలంటే ఒకడు సువార్తకు లోబడవలెను. యేసుక్రీస్తు నందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, యేసునామమును ఒప్పుకొనుచు పాపక్షమాపనణ నిమిత్తము బాప్తిస్మము పొందితే ఒకడు సువార్తకులోబడి, రక్షింపబడి, క్రైస్తవుడగును (మార్కు 16:16; అపొ.కా. 2:38). క్రైస్తవుడుగా యుండాలంటే ఒకడు స్థాపించిన సంఘ సభ్యుడుగా యుండవలెను (మత్తయి 16:18; రోమా 16:16). క్రైస్తవుడుగా యుండాలంటే ఒకడు క్రీస్తునామమును ధరించవలెను (1పేతురు 4:16). క్రైస్తవుడుగా యుండాలంటే ఒకడు దేవుని ఆత్మతోను, సత్యముతోను ఆరాధించవలెను. ప్రతి ఆదివారమున ఆరాధించవలెను (యోహాను 4:21; అపొ.కా. 20:7). క్రైస్తవుడుగా యుండాలంటే ఒకడు దేవునికి నమ్మకముగా యుండవలెను (ప్రకటన 2:10; యాకోబు 1:12). దయచేసి ఈ సంగతులన్నిటిని పదేపదే చదువుము. తదుపరి బైబిలు చెప్పుచున్న రీతిగా నేను క్రైస్తవుడనా? కానా యని నిన్ను నీవే ప్రశ్నించుకొనుము.

మిత్రుడా, జీవితం నెమ్మదిగా అంతమొందుచున్నది. నీవు త్వరలో వెళ్ళిపోతావ్. గనుక ఈ రోజే రాబోవుచున్న తీర్పు కొరకు తదుపరి జీవనము కొరకు సిద్ధపడుము. సత్యమునకు లోబడుము. క్రైస్తవునిగా యుండుము. క్రీస్తుసంఘ సభ్యుడవై యుండుము, మరణ పర్యంతము నమ్మకముగా జీవించుము, పరలోకము నీదగును.

అవును, నీవు క్రైస్తవునిగా మాత్రమే యుండగలవు. దానికి ఎక్కువ కాదు, తక్కువ కాదు.

– జె.సి. ఛోట్

# ఆయన యందు మీరును సంపూర్ణులైయున్నారు

## ( Complete in Him )

"మరియు ఆయన యందు మీరును సంపూర్ణులైయున్నారు; ఆయన సమస్త ప్రధానులకును అధికారులకును శిరస్సైయున్నాడు" (కొలస్స 2:10).

మానవుడు జీవితంలో ఎప్పుడు సంపూర్ణుడగుతాడు? అతడు జీవించిన సంవత్సరములు సుదీర్ఘములయితే, మెతూషెల అందుకు అర్హుడే, అతడు భూమి పై 969 సంవత్సరములు బ్రదికి నట్లు లేఖనములు చెబుతాయి. అయితే అతని గూర్చిన యితర సమాచారము యేమీలేదు. అతడు బ్రతికాడు, చనిపోయాడు.

దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ఈ భూమి పై శరీరాకారముగా 33 సంవత్సరములు మాత్రమే బ్రతికారు. అయినను "యేసు చేసిన కార్యములు ఇంకను అనేకములు కలవు. వాటిలో ప్రతి దానిని వివరించి వ్రాసిన యెడల అట్లు వ్రాయబడిన గ్రంథములకు భూలోక మైనను చాలదని నాకు తోచుచున్నది" అని యెహాను వ్రాసాడు (యోహాను 21:25).

గనుక ఈ లోకములో ఎంత కాలము జీవించామను దానిని బట్టిగాక, సర్వసృష్టికర్తతో మనకున్న సంబంధమును బట్టి మన సంపూర్ణ జీవితము ఆధారపడి యుండును (యోహాను 1:3). ఈ లోకంలో మన క్రియా జీవితము, అది ఆర్థిక, సాంఘిక, రాజకీయంగా ఏదైనను దానిని దేవుని చిత్తమునకు మనము చూపించు విధేయతతో పోల్చినప్పుడు అది నిమిత్తమాత్రముగా అగుపడును (రోమా 12:1-2).

నేను అనేకులైన ప్రముఖులతో పరిచయము గలవాడను. వీరిలో ఎవరు క్రైస్తవులు కారు. వారు సాధించిన విషయాలను బట్టి ఈలోకం వారిని గుర్తించవచ్చును. గాని వారి జీవితములు సంపూర్ణములా? ప్రభువు ఒక్కడు మాత్రమే దానిని నిర్ణయించు అధికారము గలవాడు.

యేసు తన జీవన కాలములో "జ్ఞానమందును, వయస్సునందును, దేవుని దయయందును, మనుష్యుల దయ యందును వర్ధిల్లుచుండెను" (లూకా 2:52). మనందరము ఆయనవలె అన్ని విషయములలో ఎదుగవలెనని ప్రభువు కోరుచున్నారు. ఆయన శిరస్సయి యున్నాడు (ఎఫెసీ 4:15). అట్లు కాకపోతే దేవుని దృష్టిలో మన జీవితములు

సంపూర్ణములు కావు.

విశ్వాసము, మారుమనస్సు, బాప్తిస్మముల ద్వారా మనము క్రీస్తు శరీరములో ప్రవేశించిన తరువాత, మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు మనము సంపూర్ణులమగునట్లు క్రొత్త నిబంధనను మనకు ఇచ్చియున్నారు. క్రైస్తవ లక్షణములను మనము అలవరచు కొనవలసియున్నది (2పేతురు1:5-11). దేవుని యొక్క సర్వాంగకవచమును మనము ధరించుకొనవలసియున్నది (ఎఫెసీ 6:10-17). మనదైనందిన జీవితంలో ఆత్మఫలములను మనము ఫలించ వలసియున్నది (గలతీ 5:22-23). మనము ఆత్మతో నడుచుచు, శరీరకార్యములను త్యజించవలసి యున్నది (గలతీ 5:16). అది మరణ పర్యంతము నమ్మకముగా యుండవలసి యున్నది (ప్రకటన 2:10; 1కొరింధీ 15:28).

అది దాసుని జీవితం జీవించవలసి యున్నది. ఆయనలో సంపూర్ణులమై యుండగోరిన యెడల వినయము విధేయత గలిగి జీవించవలసియున్నది. "కాబట్టి దేవునికి లోబడియుండుడి, అపవాదిని ఎదిరించుడి, అప్పుడు వాడు మీ యొద్దనుండి పారిపోవును. దేవుని యొద్దకు రండి, అప్పుడాయన మీ యొద్దకు వచ్చును. పాపులారా మీహృదయములను పరిశుద్ధపరచు కొనుడి" (యాకోబు 4:7-8). "ప్రభువు దృష్టికి మిమ్మును మీరు తగ్గించుకొనుడి, అప్పుడాయన మిమ్మును హెచ్చించును" (యాకోబు 4:10). నీవు పరిపూర్ణ జీవితమును కాంక్షించు చున్నావా? అయితే

సువార్తను వినుము (యోహాను 6:45).

యేసుక్రీస్తు సువార్తను విశ్వసించుము (రోమా 1:16).

క్రీస్తు సువార్తకు లోబడుము (2 థెస్స 1:7-9; హెబ్రీ 5:8-9)

ఆత్మనుబట్టి నడుచుకొనుము (గలతీ 5:25).

అప్పుడు నీ జీవితము సంపూర్ణము కాగలదు. ఏలయనగా ఆత్మీయ ఆశీర్వాదములన్నీ క్రీస్తునందే యున్నవి (ఎఫెసీ 1:3). ఆయనలో మనకు రక్షణ యున్నది (2 తిమోతి 2:10). ఆయనలో మనకు రక్షణ, మన పాపములకు విమోచన యున్నది (కొలస్స 1:13-14). ఆయనలో మనకు నిత్యజీవితమున్నది (1 యోహాను 5:11). - ఫ్రెడ్ డిల్లాన్

# నిజమైన స్నేహితుడెవడు ?

## ( What is a True Friend ?)

**నిజమైన స్నేహితుడెవరు? బైబిలు చెప్పు దిగువ సంగతులను గమనించుము:**

**అతడు ఎల్లవేళలా నిన్ను ప్రేమించును :**

"నిజమైన స్నేహితుడు విడువక ప్రేమించును" (సామె 17:17). నిజస్నేహితుడు నిన్ను గూర్చి సమస్తము ఎరుగును, నిన్ను విడువక ప్రేమించును.

**అతడు నిన్ను హత్తుకొని యుండును :**

"సహోదరుని కంటెను ఎక్కువగా హత్తియుండు స్నేహితుడు కలడు" (సామె 18:24). "ఒకని భారములను నొకడు భరించి యిలాగు క్రీస్తు నియమమును పూర్తిగా నెరవేర్చుడి" (గలతీ 6:2).

**నీవు వినవలసిన మాటలు అతడు చెప్పును :**

"మేలు కోరి స్నేహితుడు గాయము చేయును. పగవాడు లెక్కలేనన్ని ముద్దులు పెట్టును" (సామె27:6). సామె 28:23; సామె 12:26; 1సమూ 23:16 చదువుము.

**తన హృదయాలోచనలను బట్టి నీకు సహాయముచేయును :**

"తైలమును అత్తరును హృదయమును సంతోష పరచునట్లు చెలికాని హృదయములో నుండి వచ్చు మధురమైన మాటలు హృదయమును సంతోషపరచును" (సామె 27:9).

**నీలోనున్న మంచిని అతడు బయటకు తెచ్చును :**

"ఇనుము చేత ఇనుము పదును పెట్టబడును. అట్లు ఒకడు తన చెలికానికి వివేకము పుట్టించును" (సామె 27:17). సామె 12:26, 1సమూ 23:16 చదువుము.

**ఆపదలలో నీతో అతడుండును :**

"నీ స్నేహితునైనను, నీతండ్రి స్నేహితునైనను విడిచిపెట్టకుము. నీకు ఆపద కలిగిన దినమందు నీ సహోదరుని యింటికి వెళ్ళకుము. దూరములో నన్ను సహోదరుని కంటె దగ్గరనున్న పొరుగు వాడు వాసి" (సామె 27:10). ఈలోక మంతా విడిచిపెట్టినా, నిజస్నేహితుడు నిన్ను విడిచిపెట్టడు.

**అతడు ఎల్లప్పుడు నిన్ను ప్రేమించును :**

"తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టు వానికంటె ఎక్కువైన

ప్రేమగల వాడెవడును లేదు. నేను మీకాజ్ఞాపించు వాటిని చేసిన యెడల మీరు నా స్నేహితులైయుందురు" (యోహాను 15:13-14; రోమా 5:6-10).

**అతడు నిన్ను అంటుకొనియే యుండును :**

'నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను అని ఆయనయే చెప్పెను గదా" (హెబ్రీ 13:5; లూకా 7:34).

**నీవేమి వినవలెనో అతడు చెప్పును :**

"దాసుడు తన యజమానుడు చేయు దానిని ఎరుగడు గనుక ఇక మిమ్మును దాసులని పిలువక స్నేహితులని పిలుచు చున్నాను. ఎందుకనగా నేను నాతండ్రి వలన వినిన సంగతులన్నిటిని మీకు తెలియజేసితిని'' (యోహాను 15:15; యోహాను 8:32; 2పేతురు 1:3; 2తిమోతి 3:16-17; నిర్గమ.కా. 33:11).

**అతడు తన ఆలోచనను నీకు తెలియ జేయును :**

"మీలో ఎవనికైనను జ్ఞానము కొదువుగా ఉన్నయెడల అతడు దేవుని నడుగవలెను. అప్పుడది అతనికి అనుగ్రహింపబడును. ఆయన ఎవనిని గద్దింపక అందరికి ధారాళముగ దయ చేయువాడు" (యాకోబు 1:5).

**అతడు నీలోనున్న మంచిని బయటకి తెచ్చును :**

"నన్ను బలపరచు వాని యందే నేను సమస్తము చేయగలను" (ఫిలిప్పీ 4:13; యోహాను 15:5).

**అవసరం వచ్చినప్పుడల్లా అతడు నీ యొద్ద నుండును :**

"ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నాయొద్దకు రండి, నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వికుడను దీనమనస్సుగలవాడను గనుక మీ మీద నాకాడియెత్తుకొని నా యొద్ద నేర్చుకొనుడి. అప్పుడు మీప్రాణములకు విశ్రాంతి దొరుకును. ఏలయనగా నాకాడి సుళు వుగాను నాభారము తేలికగాను ఉన్నవి" (మత్తయి 11:28-30; లూకా 15:4).

ఒక మంచి మిత్రుడు వచ్చి నీ తలుపుతట్టిన యెడల నీవేమిచేతువు ? నీ హృదయమనే తలుపు దగ్గర యేసు తట్టు చున్నారు (ప్రకట 3:20). వెంటనే తలుపు తెరచి ఆయనను నీ హృదయములోనికి ఆహ్వానించవా? ఆయన స్నేహితునిగా నీవు కాగలవా ?

-మైక్ బెన్సన్

# వెలుగులో నడుచుట

## ( Walking in the Light)

"అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడచిన యెడల మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము. అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతిపాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1యోహాను 1:7).

**వెలుగులో నడుచుట ప్రాముఖ్యము :**

మనము వెలుగులో నడువని యెడల దేవునితో సహవాసము కలిగి యుండలేము. దేవునితో సహవాసము కలిగిన వారమని చెబుతూ మనం చీకటిలో నడచిన యెడల మనము అబద్ధికులమని యోహాను దానిముందు వచనములో చెప్పియున్నాడు. తదుపరి అపొస్తులులు దేవునితోను, యేసుక్రీస్తుతోను సహవాసము కలిగియున్నారని ... చెప్పాడు. సహోదరులు అపొస్తు... ప్రభువుతోను సహవాసము కలిగియుండ గల్గున్నట్లు అతడీసంగతులను వ్రాయు చున్నానని తెలియజేసాడు. అయితే ఆ సహవాసము "వెలుగులో నడిస్తేనే" సాధ్యమగును.

**వెలుగులో నడుచుట సాధ్యమే :**

యోహాను 'నాచిన్నపిల్లలారా' అని సంబోధించాడు. అపొస్తులులు వెలుగులో నడుచుచున్నారు, వారు అపొస్తులుల మాదిరిననుసరించాలని యోహాను చెప్పుచున్నాడు. నిజానికి వారు వెలుగులో నడుచుకొనకపోతే వారికున్న సహవాసమును కొనసాగించుకొనలేరు. వారు వెలుగులో నడుచుచుండిన యెడల, మనము కూడ వెలుగులో నడుచు కొనగలము, వారితో సహవాసము కలిగి యుండగలము. యిది యోహాను యొక్క కోరిక.

**వెలుగులో నడుచుట అంటే, పాపము లేకుండ జీవించుటయని అర్థము కాదు :**

"మనము పాపము లేనివారమని చెప్పుకొనిన యెడల మనలను మనమే మోసపుచ్చుకొందుము, మరియు మనలో సత్యముండదు" అని యోహాను చెప్పాడు (1 యోహాను1:8). మనము పాపము చేయలేదని చెప్పుకొనిన యెడల దేవుని అబద్ధికునిగా చేయుదుమని తదుపరి అతడు చెప్పాడు, మరియు ఆయన వాక్యము మనలో ఉండదు. ఆ లేఖన భాగమును మనం జాగ్రత్తగా గమనించితే మనము వెలుగులో నడుచుచుండగా మనము అన్యోన్య సహవాసము కలిగి యుందుము. మరియు దేవునితోను ఆయన కుమారుడైన క్రీస్తుతోను సహవాసము కలిగియుందుము. మరియు